DC

# తెలుగు
దక్కన్ డిజిటల్ మీడియా

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | శనివారం 05 సెప్టెంబర్ 2024 | సంపుటి 1 | సంచిక 01

ఏడుగురు మావోయిస్టుల హతం

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

**ఛత్తీస్‌గఢ్, అక్టోబర్4 డీసీ తెలుగు:**
ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి తుపాకీ శబ్దాలతో దద్దరిల్లాయి. యాంటీ నక్సల్ ఆపరేషన్ సందర్భంగా శుక్రవారం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణపూర్-దంతేవాడ సరిహద్దు ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు జరిగాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో ఎన్‌కైంటర్ ప్రారంభమైంది. ఇరు వర్గాల మధ్య భీకరంగా కాల్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు

➢ మిగతా 2వ పేజిలో..

## త్వరలో పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు

- పలు మార్గాల్లో రైళ్ళను నడపడానికి ప్రణాళిక సిద్ధం




**న్యూఢిల్లీ, అక్టోబర్4 డీసీ తెలుగు:**
భారత్‌లో హైడ్రోజన్‌తో నడిచే రైళ్లు త్వరలో పట్టాలెక్కనుంది. ఈ క్రమంలో.. జర్మనీకి చెందిన రైలు భద్రతకు సంబంధించి సేఫ్టీ ఆడిట్ నిర్వహించనుంది. ఈ రైలు ట్రయల్ రన్ డిసెంబర్ 2024లో ప్రారంభమవుతుందని సమాచారం. జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్, చైనాలో హైడ్రోజన్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా ఈ జాబితాలో చేరనుంది. హైడ్రోజన్ రైలు

➢ మిగతా 2వ పేజిలో..

## అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడి

- ఈ దశలో కోర్టు జోక్యం సరికాదు
- గ్రూప్ 1పై హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు
- గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై పిటీషన్లపై విచారణ

2




**హైదరాబాద్, అక్టోబర్4 డీసీ తెలుగు :**
తెలంగాణ గ్రూప్ 1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. 2022లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ జి దామోదర్‌రెడ్డితోపాటు వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మరో అయిదుగురు ఈ పిటీషన్లను దాఖలు చేశారు. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న

➢ మిగతా 2వ పేజిలో..

## సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

- నేటితో డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయండి
- జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ ఆదేశం
- 9,090 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



**హైదరాబాద్,అక్టోబర్4 డీసీ తెలుగు :**
తెలంగాణ డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్) సెప్టెంబర్ 30న విడుదలైన సంగతి తెలిసిందే. ఫలితాలు విడుదలైన మరుసటి రోజు నుంచే అంటే అక్టోబర్ 1వ తేదీ నుంచే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. 1:3 నిష్పత్తిలో ఎంపిక చేసిన అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలంటూ అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు, ఈమెయిల్‌లకు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే సమాచారాలు పంపించారు. ఇక ఈ ప్రక్రియను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్టోబరు 5వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో అక్టోబరు 3న ఆయన ఈ మేరకు కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. మొత్తం 11,062 మంది ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. అందుకు తగిన విధంగా సకాలంలో

➢ మిగతా 2వ పేజిలో..

## 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదు

- రుణమాఫీ కాలేదని వ్యవసాయ మంత్రే చెప్పారు
- సీఎం బండారం మరోసారి బట్టబయలైంది
- 100% రుణమాఫీ పూర్తి చేశామన్నది డొల్లమాటలే
- రాబందు ప్రభుత్వంతో రైతులకు ప్రయోజనం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు


2

## ధరణి పోర్టల్ రద్దు.. త్వరలో కొత్త చట్టం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్4 డీసీ తెలుగు :**
ధరణి పోర్టల్ ను రద్దు చేసి త్వరలో ఆర్ఓఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ను గాలికి వదిలేసింది.. పూర్తైన ఇండ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఇక, వెంటనే మరమ్మత్తులు మౌలిక వసతులు కల్పిస్తాం.. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4 వేల ఇండ్లు మంజూరు.. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈనెల 7వ తేదీత ప్రజా ప్రభుత్వం ఏర్పాడి 10 నెలలు పూర్తి అవుతుంది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేక పోయాం.. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తాం.. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తాం.. అర్హతలను

➢ మిగతా 2వ పేజిలో..

## ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగులకు కొత్త పథకం!

- ఉద్యోగ శిక్షణతోపాటు ప్రతినెల రూ.5000 ఆర్థికసాయం
- కీలక నిర్ణయం దిశగా కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, అక్టోబర్4 డీసీ తెలుగు :**
కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. దేశంలో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగుల కోసం కొత్త పథకం ప్రారంభించింది. పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పేరుతో ప్రతినెలా నిరుద్యోగులకు రూ.5000 ఆర్థిక సాయం అందించనుంది. కార్పొరేట్ అఫైర్స్ మంత్రిత్వశాఖ ఈ పథకం కింద నిరుద్యోగులకు కంపెనీలలో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగులకు ఇంటర్న్‌షిప్ అందిస్తోంది. దేశంలో నిరుద్యో సమస్యకు పరిష్కరించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం పిఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ తీసుకువచ్చింది. 2024 లో కేంద్ర బడ్జెట్ లో ఈ పథకం గురించి ప్రభుత్వం ప్రకటించింది. ఇండియాలోని టాప్ 500 కంపెనీలలో దేశంలోని 500 మంది నిరుద్యోగ యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ కోటి మంది నిరుద్యోగులకు పథకం కింద ఒకసారి రూ.6000, ఆ తరువాత ప్రతినెలా రూ.5000 ఇంటర్న్‌షిప్ ని ఆర్థిక సాయంగా అందజేస్తామని వెల్లడించారు. ఈ పథకం దశల వారీగా అమలు జరుగుతుంది. మొదటి దశ రెండు సంవత్సరాలు, రెండో దశ మూడు సంవత్సరాల వరకు ఉంటుంది. పిఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రక్రియ, అర్హత పిఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రకారం.. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు యువతకు ఇంటర్న్‌షిప్ లోని 10 శాతాన్ని చెల్లిస్తాయి. కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సియస్ఆర్)లో భాగంగా కంపెనీలో ఈ బాధ్యతను నిర్విర్తుస్తున్నాయి. ఈ పథకం ద్వారా ఇంటర్న్‌షిప్ పొందాలనుకునే నిరుద్యోగులు ఆన్‌లైన్ పోర్టల్ లో అప్లై చేసుకోవచ్చు. త్వరలోనే ఈ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా ఉద్యోగం పొందాలనుకునే వారి వయసు 21 సంవత్సరాల నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. చదువు పూర్తి చేసినవారికి మాత్రమే ఈ పథకం కోసం అప్లై చేసుకోవాలి. అయితే

➢ మిగతా 2వ పేజిలో..

## రేవంత్ రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడు

- రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు
- రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు
- తొర్రూరు రైతు ధర్నాలో పాల్గొన్న హరీశ్ రావు



**మహబూబాబాద్, అక్టోబర్4 డీసీ తెలుగు:**
పది నెలల ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు, ప్రజలు అంటే పట్టింపు లేదు.. ఆయన మొనగాడు కాదు మోసగాడు అని తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు రైతు ధర్నాలో హరీశ్ రావు పాల్గొని ప్రసంగించారు. రుణమాఫీ చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైంది. కొమరెల్లి మల్లన్న, యాదాద్రి, భద్రాద్రి, సమ్మక్క %-% సారలమ్మ మీద ఒట్టు పెట్టి మొనగాడు లెక్క మాట్లాడిండు. కానీ ఇప్పుడు ఆయన మోసగాడు అని తేలిపోయింది. రైతు బంధు, రుణమాఫీ, పింఛన్లు, మహాలక్ష్మి అన్ని చేస్తా అన్నాడు. ఇప్పుడు సప్పుడు లేదు. మొత్తం రుణమాఫీ అయ్యింది రాజీనామా చేయ్ హరీష్ రావు అని సవాల్ విసిరిండు. మరి రుణమాఫీ అయితే ఇంత మంది రైతులు ధర్నాకు ఎందుకు వచ్చారు..? పాలకుర్తి మండలంలోనే 4314 మందికి రుణమాఫీ కాలేదు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పారు. మిగతా వారికి కాలేదు అన్నడు. చెప్పిన 22 లక్షల మందిలో కూడా కొందరికి పూర్తిగా రుణమాఫీ కాలేదు. రకరకాల కారణాలతో రుణమాఫీ ఆపే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. 31 సాకులు పెట్టి రుణమాఫీ ఎగబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. రేవంత్ మోసగాడు అని రైతులు, ప్రజలు అంటున్నారు

➢ మిగతా 2వ పేజిలో..

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

**మొదటిపేజీ తరువాయి..** హతమైనట్లు దంతెవాడ ఎస్పీ తెలిపారు.నక్సలైట్లు ఉన్నారనే సమాచారంతో భద్రతా బలగాలు ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో భద్రతా బలగాలు సురక్షితంగా ఉన్నాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. నారాయణపూర్, దంతెవాడ జిల్లాల పోలీస్ బృందాలు ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయి. బస్తర్ వ్యాప్తంగా యాంటీ నక్సల్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు. ఎన్‌కౌంటర్ తర్వాత భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## సకాలంలో ధ్రువపత్రాలను పరిశీలించాలి

**మొదటిపేజీ తరువాయి..**ధ్రువపత్రాలను పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే 9,090 మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.ముఖ్యమంత్రితో నిర్వహించిన ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ధ్రువపత్రాల పరిశీలన నేటితో ముగియనుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నీ జిల్లాల్లోని ఆయా కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియకు అభ్యర్థులు హాజరుకావల్సి ఉంటుంది. మార్కులు, రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ ప్రక్రియ రేపటితో ముగుస్తుంది. ఇప్పటికే ఈ జాబితాలు అధికారిక వెబ్‌సైట్‌తోపాటు, డీఈఓ వెబ్‌సైట్లలోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులు డీఈఓలు గుర్తించిన కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల ఫొటో కాపీలతో హాజరుకావల్సి ఉంటుంది. అంతా సక్రమంగా జరిగితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లు ఈ నెల 9వ తేదీన నియామక పత్రాలు అందజేసే అవకాశం ఉంది.

## 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదు

**హైదరాబాద్, అక్టోబర్4 :**
సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందని కేటీఆర్ అన్నారు. 100% రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి డొల్లమాటలే అని మరోసారి తేలిపోయిందన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్న సన్నాసి మాటలు మోసం తప్ప మరొకటి కాదా అని ప్రశ్నించారు. రాబందు ప్రభుత్వం ఉంటే రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, రేవంత్ అసమర్థత ధాన్యం దాతలకు కోలుకోలేని శాపమని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఒకవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని మాయమాటలు చెప్పి.. మరోవైపు 10 నెలల తర్వాత కూడా 20 లక్షల మందిని మోసం చేశారని మండిపడ్డారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ?? అని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే.. 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో ?? అని ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోని శాపం అని ట్విటర్ వేదికగా సీఎం పై మండిపడ్డారు.

## ధరణి పోర్టల్ రద్దు.. త్వరలో కొత్త చట్టం

**మొదటిపేజీ తరువాయి..** బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.. రాబోయే నాలుగేళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి పేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. జనవరి నుంచి ఆసరా పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ చేస్తాం.. రుణ మాఫీ కానీ రైతులకు 13 వేల కోట్ల రూపాయలతో త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాలు సొల్లు మాటలు మాట్లాడుతున్నారు.. 10 ఏళ్లలో బీఆర్ఎస్ రైతులకు ఇచ్చింది 15 వేల కోట్లు మాత్రమే.. ప్రతిపక్ష పార్టీలు పోరం బోకు మాటలు మాట్లాడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

## హైడ్రాపై అఖిలపక్ష సమావేశ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

**బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**హైదరాబాద్, అక్టోబర్4 :**
హైడ్రాపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అయితే అఖిలపక్ష సమావేశానికి పిలుస్తామని ముఖ్యమంత్రి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైడ్రాపై అఖిలపక్ష సమావేశం.. ముందే పెట్టి ఉంటే బుచ్చమ్మ చనిపోయేది కాదని తెలిపారు. నల్లచెరువులో బీఆర్ఎస్ నేతల ఆక్రమణలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చేసినవి ఆరోపణలు మాత్రమేనని.. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... నల్ల చెరువు చుట్టూ బీఆర్ఎస్ హయాంలో కట్ట కట్టామని తెలిపారు. రైతులు కోర్టుకు వెళ్లడంతో జీహెచ్ఎంసీ అధికారులు కట్టను తొలగించారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు చెరువులు ఆక్రమిస్తే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వం చేతుల్లో ఉంది విచారణ చేసుకోవాలని రేవంత్ రెడ్డికి సూచించారు. కాజాకుంటలో ఇద్దరు జడ్జీలకు ఏపార్టీ నేతలు భూములు అమ్మారో సీఎం రేవంత్‌రెడ్డి విచారణ చేయించాలని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను ఒప్పించి వారి ఇళ్లను ఖాళీ చేయించాలని కోరారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మరిచిపోవద్దని అన్నారు. చెరువులు ఎవరు కబ్జా చేశారో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బీజేపీ హైదరాబాద్ నగరానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. హైడ్రా భాదితులకు అండగా బీజేపీ నుంచి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఒక్కరూ మాత్రమే మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు.

## అభ్యంతరాల స్వీకరణ తర్వాతే ఫలితాలు వెల్లడి

**మొదటిపేజీ తరువాయి..** అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ప్రభుత్వం తరపు న్యాయవాది కీలక విషయాలను ధర్మాసనానికి తెలియజేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామని, వాటిని ఆయా సబ్జెక్ట్‌ల వారీగా నిపుణుల కమిటీకి పంపి, వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్లు టీజీపీఎస్సీ హైకోర్టుకు నివేదించింది. మెయిన్స్ క్వాలిఫై అయిన వారికి త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని తెలిపింది. ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరపున ఎం రాంగోపాల్‌రావులు వాదనలు వినిపించారు. గ్రూప్ 1 పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించి, కొన్ని సిఫార్సులు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకుని రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేసినట్లు తెలిపారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు. ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్లు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామని, ఈ పిటిషన్‌లను కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. అయితే గురువారం కోర్టులో వాదనలు పూర్తికాకపోవడంతో తదుపరి విచారణను అక్టోబరు 4కి వాయిదా వేశారు. శుక్రవారం ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత కోర్టు అంతిమ నిర్ణయం ఏం చెబుతుందనేది వేచి చూడాలి.

## రేవంత్ రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడు

**మొదటిపేజీ తరువాయి..** అని హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగష్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు.హామీలు అమలు చేసే వరకూ రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని హరీష్‌రావు విమర్శించారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డి గుండాగిరిచేస్తే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకోరని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. పాలకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలట... అయినా అభివృద్ధి జరగడం లేదని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్, అబద్దాలకోరు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శలు చేశారు. ఇవాళ (శుక్రవారం) తొర్రూరులో ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, మాలోతు కవిత, రుణమాఫీ కానీ రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకరరావు మాట్లాడుతూ... సీఎం అయ్యాక రేవంత్‌రెడ్డి అబద్దాలు ఎక్కువ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ఎందుకు ఓడించామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రుణమాఫీ చేసేదాక వదిలిపెట్టామని ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు.

## ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగులకు కొత్త పథకం!

**మొదటిపేజీ తరువాయి..** ఐఐఎం, ఐఐటి, ఐఐఎస్ఈఆర్ లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన వారికి ఈ పథకం వర్తించదు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసినవారు, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసినవారు ఈ పథకానికి అర్హులు. విద్యార్థులకు క్లాస్ రూమ్ చదువుల తో పాటు కంపెనీలలో ప్రాక్టికల్ ఉద్యోగ అనుభవం ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా లభిస్తుంది. ఈ పథకం కోసం అక్టోబర్ రెండో వారంలో ప్రభుత్వం అన్ లైన్ పోర్టల్ ప్రారంభించ బోతోంది. ఈ పథకంల ప్రభుత్వంతో ఒప్పందం ఉన్న కంపెనీలు ఈ ఆన్‌లైన్ పోర్టల్ లో ప్రత్యేకంగా డాష్ బోర్డ్ కేటాయిస్తాయి. అందులో ఇంటర్న్‌షిప్ అవకాశాలు, కంపెనీ లొకేషన్, ఉద్యోగం కావాల్సిన విద్యార్హత, ఇంటర్న్‌షిప్ కు లభించే సదుపాయాలు.. ఇలా అన్ని వివరాలుంటాయి. పోర్టల్ అభ్యర్థుల తమ వివరాలు నమోదు చేస్తే.. అదే రెజ్యూమ్ కూడా తయారు చేస్తుంది. ఇంటర్న్‌షిప్ కు అన్ని అర్హతలు కలిగిన అభ్యర్థులు తమకు సూట్ అయ్యే ఏదైనా అయిదు కంపెనీలలో అప్లై చేసుకోవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ఖర్చు పెట్టబోతోంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 7 వరకు ప్రభుత్వం అన్ని అప్లికేషన్లు పరిశీలించి తరువాత నవంబర్ 15 లోగా అభ్యర్థులకు వారి సెలెక్షన్ గురించి తెలియజేయబడుతోంది. డిసెంబర్ 2, 2024 నుంచి ఇంటర్న్‌షిప్ మొదలవుతుంది. మార్చి 2025 లోగా మొత్తం 1.25 లక్షల అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ అందుతుంది.

## త్వరలో పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు

**మొదటిపేజీ తరువాయి..** ఒక్క యూనిట్ ఖరీదు రూ.10 కోట్లకు పైగా ఉంటుంది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం.. రైల్వే మొదట 35 రైళ్లను నడపనుంది. ఒక్కో రైలుకు రూ.80 కోట్లు ఖర్చవుతుంది. దీని గ్రౌండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సిద్ధం చేయడానికి రూ.70 కోట్లు వెచ్చించనున్నారు. సిస్టమ్ ఇంటిగ్రేటెడ్ యూనిట్ బ్యాటరీ, రెండు ఇంధన యూనిట్లను విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ రైలును మొదట జింద్-సోనిపట్ సెక్షన్‌లో నడపనున్నట్లు సమాచారం. హర్యానాలోని రైళ్లకు హైడ్రోజన్ జింద్‌లో ఉన్న 1 %వీఔ% పాలిమర్ ఎలక్ట్రోలైట్ మెమ్బ్రేన్ ఎలక్ట్రోలైజర్ నుండి అందించబడుతుంది. ఇక్కడ ప్రతిరోజూ దాదాపు 430 కిలోల హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుంది. 3000 కిలోల హైడ్రోజన్ నిల్వ సామర్థ్యం కూడా ఉంటుంది.హైడ్రోజన్ రైలు హైడ్రోజన్ ఇంధనంతో నడుస్తుంది. ఇందులో ఇంజన్ స్థానంలో హైడ్రోజన్ ఇంధన కణాలు అమర్చబడి ఉంటాయి. ఈ రైళ్లు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ లేదా పార్టిక్యులేట్ మ్యాటర్ వంటి కాలుష్య కారకాలను విడుదల చేయవు. దీని వల్ల కాలుష్యం ఉండదు. హైడ్రోజన్ ఇంధన కణాల సహాయంతో, హైడ్రోజన్ ఇంధనాన్ని ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేయబడుతుంది. ఈ రైలును హైడ్రైల్ అని కూడా అంటారు. ఈ రైలులో నాలుగు కోచ్‌లు ఉండనున్నట్లు తెలుస్తోంది. నీలగిరి మౌంటైన్ రైల్వే, డార్జిలింగ్ హిమాలయన్, కల్కా సిమ్లా రైల్వే, కాంగ్రా వ్యాలీ, బిల్మోరా వాఘై మరియు మార్వార్ దేవ్‌గర్ మదారియా మార్గాల్లో ఈ రైలును నడపడానికి ప్రణాళిక ఉంది. ఈ రైలు గంటకు 140 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. ఈ రైలు కారుపాతల, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో సిద్ధమవుతోంది. డీజిల్ రైలుతో పోలిస్తే ఈ రైలు నడపడానికి ఎక్కువ ఖర్చు అవుతుంది. అయితే.. పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. గ్రీన్ హైడ్రోజన్ కిలోకు దాదాపు రూ.492 ఉంటుంది. ఈ రైలు నిర్వహణ డీజిల్ రైలు కంటే 27 శాతం ఖర్చుతో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. ఫ్రెంచి కంపెనీ తొలిసారిగా హైడ్రోజన్ రైలును సిద్ధం చేసింది. 2018 నుంచి అక్కడ హైడ్రోజన్ రైలు నడుస్తోంది.

## తిరుమల బ్రహ్మోత్సవాలకు ముందు అపశృతి

**అమరావతి, అక్టోబర్4 :**
తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సంధర్భంగా ధ్వజస్తంభం కొక్కెం ద్వారానే గరుడ పతాన్ని ఎగురవేస్తారు అర్చకులు. అయితే ఈ కొక్కి అకస్మాత్తుగా విరిగిపోయిన పరిస్థితి. కొక్కి విరిగినట్లు గుర్తించిన అధికారులు.. అర్చకులకు సమాచారం అందించారు. అర్చకులు హడావుడిగా ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. వెంటనే కొక్కిని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇటీవల తిరుమల లడ్డుకి వినియోగించిన నెయ్యి కల్తీకి గురైనట్లు వివాదం రేగగా.. యావత్ దేశం మొత్తం తిరుమలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో తిరుమల పవిత్రతను కాపాడేందుకు టీటీడీ అన్ని చర్యలు తీసుకుంది. అలాగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసింది. పురాణాల ప్రకారం శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలిసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవున్ని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారట. ఈ ప్రకారం ఆనందనిలయం మధ్యలో ఆవిర్భవించిన శ్రీవేంకటేశ్వరుడికి కన్యామాసంలోని శ్రవణ నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారట. అందువల్లే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది అప్పటినుండి నిరాటంకంగా కొనసాగుతున్నాయి. అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు 9 రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తి అయిన శ్రీ మలయప్పస్వామివారు వివిధ వాహనాలపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దివ్యదర్శనం కల్పిస్తారు. బ్రహ్మోత్సవ వాహనసేవలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి ఏర్పాట్లు పూర్తిచేసింది. భక్తులందరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రీవారి వాహన సేవలతో పాటు మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ సాయంత్రం 6.30 నుండి రాత్రి 11 గంటల వరకు జరుగుతుంది. ఆలయ నాలుగు మాడ వీధులలో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్యాలరీలలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. భక్తులు మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, క్యూలైన్ల గేట్లు పటిష్టంగా ఏర్పాటు చేశారు.

## జీవో నెంబర్ 99పై స్టే విధించాలి

**హైడ్రాపై హైకోర్టుకు కేఏపాల్**

**హైదరాబాద్, అక్టోబర్4 :**
రాష్ట్రంలో హైడ్రా కూల్చివేతలపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. జీవో నెంబర్ 99పై స్టే విధించాలంటూ ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరుగగా.. హైడ్రా కూల్చివేతలు తక్షణమే ఆపేయాలని పాల్ వాదనలు వినిపించారు. అయితే ఇప్పటికిప్పుడు కూల్చివేతలు ఆపలేమని న్యాయస్థానం వెల్లడించింది. హైడ్రా కు చట్టబద్ధత కల్పించిన తరువాతే యాక్షన్ మొదలు పెట్టాలని పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ వాదనలు వినిపించారు. అక్రమ కట్టడాలు కూల్చివేతలకు 30 రోజులు ముందే నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వాదనలు విన్న హైకోర్టు.. ప్రతివాదులుగా హైడ్రా, ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ ధాఖలు చేయాలని హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది.

## పురవీధుల్లో కన్యకా పరమేశ్వరి అమ్మ వారి నగరోత్సవం



**చీరాల(ఉదయ సారథి):**
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం చీరాల సంత బజారులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు ఉత్సవాల్లో పాల్గొన్నారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు పురవీధుల్లో అమ్మవారికి 108 కలశాలతో నగరోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ తొమ్మిది రోజులపాటు దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుమారునికి కారుణ్య నియామక పత్రం



## అందజేసిన ఎస్పీ ఏఆర్ దామోదర్

**ఒంగోలు (ఉదయ సారథి):**
గుడ్లూరు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ 08.06.2023న అనారోగ్యంతో మరణించిన కీర్తి శేషులు యం నారాయణ రావు (హెచ్ సి.1661) కుమారుడు అనిల్ కుమార్ కి కారుణ్య నియామకం క్రింద జిల్లా పోలీసు ట్రైనింగ్ కాలేజీ లో టైపిస్ట్ గా ఉద్యోగం కల్పిస్తూ నియామకపత్రాన్ని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందచేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మరణించిన హెడ్ కానిస్టేబుల్ యొక్క కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ గా సుదీర్ఘ కాలంగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించడం బాధాకరమని, వారికి ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసు శాఖ వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనిల్ కుమార్ తో మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిం


## మంత్రి సురేఖ వ్యాఖ్యలపై చిత్రసీమ భగ్గు మండిపడ్డ పరిశ్రమకు చెందిన ప్రముఖులు

# చిరు సహా అగ్రతారలంతా ఆగ్రహం







కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సమంత, నాగచైతన్య, నాగార్జున పేర్లను ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆమె వ్యాఖ్యలపై చిత్రసీమ సీరియస్ అయ్యింది. ఆమె తీరును పరిశ్రమకు చెందిన వారంతా ముక్తకంఠంతో ఖండించారు. ఆమె బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక చిత్రసీమను బజారుకీడ్చడం తగదని హితవు పలికారు. కొండా వ్యాఖ్యలను ఖండిస్తూ అగ్ర కథానాయకుడు చిరంజీవి, వెంకటేశ్, మహేశ్ బాబు, రామ్‌గోపాల్ వర్మ, రవితేజ, దర్శకుడు శంకర్ తదితరులు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. గౌరవనీయులైన మహిళా మంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలు చూసి నేను చాలా బాధపడ్డానని చిరంజీవి అన్నారు. త్వరితగతిన వార్తల్లో నిలిచేందుకు సెలబ్రిటీలు.. సినీ కుటుంబానికి చెందిన వ్యక్తులను సాఫ్ట్ టార్గెట్ చేసుకోవడం సిగ్గు చేటు. చిత్ర పరిశ్రమకు చెందిన సభ్యులపై ఇలాంటి మాటల దాడులను మేమంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నాం. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు, మరీ ముఖ్యంగా మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. సమాజాభివృద్ధి కోసం మేము మా నాయకులను ఎన్నుకుంటాం. ఇలాంటి వ్యాఖ్యలు చేసి వారు తమ స్థాయిని తగ్గించుకోకూడదు. రాజకీయ నాయకులు, గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవారు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలవాలని చిరంజీవి పేర్కొన్నారు. నాగార్జున కుటుంబాన్ని అత్యంత దారుణంగా అవమాన పరిచిన కొండా సురేఖ కామెంట్లకు నేను షాక్ అయ్యా. ఆమె తన రాజకీయ ప్రత్యర్థి మీద పగ తీర్చుకునే క్రమంలో అత్యంత గౌరవప్రదమైన నాగార్జున కుటుంబాన్ని లాగడం ఏ మాత్రం సహించకూడనిదని దర్శకుడు రాంగోపాల్ వర్మ అన్నారు. ఇతరుల వ్యక్తిగత పరిస్థితిని రాజకీయాల కోసం వాడటం నన్నెంతో బాధించింది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం అని నటుడు వెంకటేశ్ అన్నారు. ముఖ్యమైన నాయకత్వ స్థానాల్లో ఉన్న వ్యక్తులు సంయమనం, సానుభూతి పాటించాలని కోరుతున్నా. మీ చర్యలు, మాటలు జనాల్లో స్ఫూర్తి నింపేలా ఉండాలని కోరుకుంటున్నా అని వెంకటేశ్ పేర్కొన్నారు. ఓ కేబినెట్ మంత్రి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వినటం చాలా బాధాకరం.


ఎలాంటి సమాజంలో మనం బతుకుతున్నాం అని నిర్మాత స్వప్నదత్ అన్నారు. ప్రతిసారీ రాజకీయ నాయకులు సినీ పరిశ్రమకు చెందినవారిపై ఇలాంటి నిందలు వేయడం కోపం తెప్పిస్తోందని మంచు లక్ష్మి అన్నారు. రాష్ట్రంలో ఏదైనా భయంకరమైన సంఘటన జరిగినప్పుడు రాజకీయ నాయకులు వారి అజెండాల కోసం సినీ ప్రముఖుల నుంచి మద్దతు కోరుతారు. ఓ మహిళ నుంచి ఇలాంటి ఆరోపణలు మరింత ఎక్కువ బాధ కలిగిస్తున్నాయి. ఇలా రాజకీయాల్లోకి లాగొద్దు. ఇది చాలా అన్యాయం అన్నారు. మీరు కేవలం మహిళలను అవమానించడమే కాదు.. తెలంగాణకు గర్వకారణమైన మొత్తం సినీ పరిశ్రమను అగౌరపర్చారు. ఇలాంటి విషయాల నుంచి ప్రజలను పాలించడం వైపు దృష్టి మరల్చండి. మీ గౌరవం ఇప్పటికే తగ్గిపోయింది. దానిని మరింత దిగజార్చద్దనిహీరో సుధీర్ బాబు పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితాలను రాజకీయ వివాదంలోకి లాగడం గీత దాటడమే. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న నాయకులు.. ఇతరులపై గౌరవంగా వ్యవహరించాలి. ముఖ్యంగా సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని నిరాధార, నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు చేస్తే తేలిగ్గా తీసుకోం. ఇలాంటి ఆరోపణలను మేం ఎన్నటికీ సహించబోం అని నిర్మాత ఎస్కేఎన్ తెలిపారు.

# మాటలను అదుపులో పెట్టుకోండి సినీ కుటుంబం నుంచి గట్టిగా వాయిస్



ఆవేశంలో మాట జారుతాం. ఎలాంటి సందర్భంలోనైనా మాట అదుపులో పెట్టుకోవడమే ఉత్తమ వ్యక్తుల అత్యుత్తమ లక్షణం. ఒక ఉన్నత పదవిలో ఉన్నప్పుడు, ఎంత ఒత్తిడిలో ఉన్నా కూడా స్ఫూర్తిదాయకంగా వ్యవహరించే తీరు మన పెద్దల నుంచి మనం నేర్చుకోవాలి. కనీసం ఇప్పటినుంచి అయినా సినీ కుటుంబం తరఫు నుంచి గట్టిగా మన వాయిస్ వినిపించే సమయం వచ్చిందని నా అభిప్రాయం. మనకు కూడా కుటుంబాలున్నాయి. మనం కూడా మనుషులమే. మన మనసులూ బాధపడతాయని బన్నీ వాస్ అన్నారు. ఒక మంత్రిగా వ్యవహరిస్తోన్న వ్యక్తి బహిరంగ వేదికపై ఇతరుల వ్యక్తిగత జీవితం గురించి ఇలాంటి ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలు చేసి.. దాని నుంచి తప్పించుకుంటారని ఎలా భావిస్తున్నారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదని శైలేశ్ కొలను అన్నారు. కొండా సురేఖ గారు వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగడం దురదృష్టకరం. ప్రజాప్రతినిధులు గౌరవంగా వ్యవహరించాలి. సినిమా పరిశ్రమను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే మేము అంగీకరించం రాహుల్ విజయ్ అన్నారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తాజాగా అగ్ర కథానాయకుడు వెంకటేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. సినీ ప్రముఖులు, వారి కుటుంబాలపై చేసిన నిరాధారమైన, కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ ప్రవర్తన చాలా అగౌరవంగా, మన తెలుగు సంస్కృతి విలువలకు విరుద్ధంగా ఉంది. ఇలాంటి బాధ్యతారహితమైన చర్యలను సాధారణమైనవిగా అంగీకరించకూడదు. ఇతరుల వ్యక్తిగత గోప్యత, మరీ ముఖ్యంగా మహిళలను గౌరవించేలా పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నా. మనందరం కలిసి సమాజంలో గౌరవం, మర్యాద పెంపొందించాలని అల్లు అర్జున్ అన్నారు. సినీ ప్రముఖులపై రాజకీయ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరం. వ్యక్తిగత జీవితాలను ఇబ్బందిపెట్టేలా ఈ కామెంట్స్ అమర్యాదకరం. దయచేసి మాట్లాడేముందు ఆలోచించండి. ఇలాంటి దూషణలను మేము ఐక్యంగా వ్యతిరేకిస్తున్నాం అని కిరణ్ అబ్బవరం అన్నారు. సినీ కుటుంబానికి చెందిన వ్యక్తిగా.. ఇలాంటి ప్రవర్తనను మేము సహించం. రాజకీయ ప్రేరేపణలకు సినీ ప్రముఖులను, వారి కుటుంబాలను సాఫ్ట్ టార్గెట్‌గా వాడుకోవడం ఇకనైనా మానేయాలి. అభివృద్ధిపై దృష్టిపెట్టండి. అంతేకానీ ఇలాంటి అర్థంలేని వాటిపై కాదని వరుణ్ తేజ్ అన్నారు. ఒక స్త్రీ గురించి మరో స్త్రీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరం. దయచేసి అసలైన ప్రజాప్రయోజనాలపై దృష్టిపెట్టండని లావణ్య త్రిపాఠి అన్నారు. మీ వ్యాఖ్యలు ఎదుటివారిని ఎలా ఇబ్బందిపడతాయో కామెంట్ చేసేముందు ఒక్కసారి ఆలోచించండి. మనం ఇతరులను నవ్వించకపోయినా ఫర్వాలేదు. కానీ ఇతరుల కన్నీళ్లకు కారణం కాకూడదని విశ్వక్‌సేన్ అన్నారు.

# దేవర విజయోత్సవ వేడుక సక్సె మీట్

## పెట్టలేక పోయామన్న నాగవంశీ



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'దేవర' మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమా సక్సెస్ మీట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ విషయంపై నిర్మాత నాగవంశీ పోస్ట్ పెట్టారు. ఈ ఈవెంట్‌ను భారీగా నిర్వహించాలని అనుకున్నప్పటికీ అనుమతులు లభించలేదని తెలిపారు. సక్సెస్ మీట్‌ను నిర్వహించలేక పోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరారు. 'దేవర'ని ఈ స్థాయిలో ఆదరించినందుకు అందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించలేకపోవడంతో విజయోత్సవ వేడుకనైనా ఘనంగా చేయాలని ఎన్టీఆర్ ఎంతో భావించారు. మేము ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉన్న కారణంగా మా వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బహిరంగ వేదికలకు అనుమతులు పొందలేకపోయాం. ఈ పరిస్థితి మా నియంత్రణలో లేదు. ఈ ఈవెంట్‌ను నిర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరుతున్నాం. వేదిక అనుమతి కోసం మేము ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాం. మీ ప్రేమతో ఎన్టీఆర్ మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నానని పోస్ట్ పెట్టారు. ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే హవా కొనసాగించిన 'దేవర'.. విడుదలయ్యాక కూడా మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంటోంది. ఇప్పటివరకు రూ. 396 కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం తాజాగా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ అలరించగా విలన్‌గా సైఫ్ అలీఖాన్ కనిపించిన సంగతి తెలిసిందే.

